తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
19 జూన్ 2026
పేజీలు : 8
Follow :

## యూరియా బుకింగ్ యాప్ జూన్ 20 నుంచి ప్రారంభం

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**- జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో**

**- రైతులు ముందస్తు కొనుగోళ్లకు వెళ్లవద్దని సూచన**

**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :** వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు జూన్ 20వ తేదీ నుంచి జిల్లాలో యూరియా బుకింగ్ యాప్‌ను అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇవి సుమారు 4 లక్షల 40 వేల బస్తాలకు సమానమని ఆయన పేర్కొన్నారు. రైతులు యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.రైతులు ఒకేసారి ముందస్తుగా యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన సమయంలో మాత్రమే యాప్ ద్వారా బుక్ చేసుకొని తమకు నచ్చిన ఎరువుల దుకాణంలో యూరియా పొందవచ్చని తెలిపారు. ఒకసారి యూరియా పొందిన రైతు తిరిగి అవసరమైతే 15 రోజుల అనంతరం మాత్రమే పొందగలడని పేర్కొన్నారు.యాప్ ద్వారా బుక్ చేసిన యూరియా బస్తాలను సంబంధిత రైతు మాత్రమే పొందగలడని, తద్వారా జిల్లాలోని ప్రతి రైతుకు సమానంగా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.కావున రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ముందస్తు కొనుగోళ్లకు వెళ్లకుండా అవసరమైన సమయంలో మాత్రమే యూరియాను బుక్ చేసుకొని ప్రశాంతంగా పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు



**వేములవాడ, జూన్ 18 (జనంసాక్షి):** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో గత 28 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం లెక్కించారు. లెక్కింపులో ఆలయానికి సమకూరిన ఆదాయంరూ.1,70,65,200/- నగదు రూపం లో ఆదాయంగా వచ్చినట్లు, అదే విధంగా మిశ్రమ బంగారం 80 గ్రాములు,500 మిల్లి గ్రాములు, మిశ్రమ వెండి 07 కిలోల 400 గ్రాములు వచ్చినట్లుగా తెలిపారు.ఈ హుండీ లెక్కింపు ఆలయ ఈవో రమాదేవి , కరీంనగర్ ఏసీ ఆఫీస్ పరిశీలకులు రాజమౌళి , డీఈవో భాస్కర శర్మ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి వారు పాల్గొన్నారు.

## పిల్లల ఓపీలో రద్దీ లేకుండా క్యూ విధానంలో సేవలు అందించాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్స్ లేకుండా ప్రతి విద్యార్థిని తిరిగి చేర్పించాలి**

**- అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి**

**- ప్రతి చిన్నారి ఎదుగుదల, గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలి**

**- మాతా శిశు ఆసుపత్రి, బండారికుంట ఎంపీపీ ఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :** పిల్లల ఓపీలో రద్దీ లేకుండా క్యూ విధానంలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని నోటీస్ బోర్డు, ఓపీ కౌంటర్‌ను పరిశీలించి, ఓపీ నమోదు ప్రక్రియను ధృవీకరించారు. ముఖ్యంగా పిల్లల ఓపీ విభాగంలో రద్దీ ఏర్పడకుండా క్యూ విధానంలో సేవలు అందేలా అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆసుపత్రిలో విధుల్లో చేరిన నూతన వైద్యులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని బండారికుంట ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాల, అదే ప్రాంగణంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారులి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒక్క విద్యార్థి కూడా మధ్యలో చదువు మానకుండా ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా ఫాలోఅప్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న కొత్త సౌకర్యాలు, మెరుగైన విద్యా వాతావరణంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అదనపు ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.సరుకులు స్వీకరించే దశలోనే నాణ్యతను తనిఖీ చేయాలని, నిల్వలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సూచించారు.ప్రతి చిన్నారి ఎదుగుదలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, ఇతర వైద్య సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సీసీఆర్‌టీ సాంస్కృతిక స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు



**కరీంనగర్ అర్బన్, జూన్ 18 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్' (సి.సి.ఆర్.టి.) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్ (2025-26)" కు స్థానిక కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల కు చెందిన 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ఎంపికయ్యాడని పాఠశాల డైరెక్టర్ రష్మిత తెలిపారు. దక్షిణ భారతదేశం మొత్తం మీద కేవలం నలుగురు (4) విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికవగా, తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక విద్యార్థిగా కిట్ల చరణ్ ఘనత సాధించారని తెలిపారు. ఈ ఎంపికలో భాగంగా చరణ్‌కు అతని డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తయ్యే వరకు ప్రతీ సంవత్సరం ఈ జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి గాను విద్యార్థి చరణ్‌కు రూ.3,500, అతనికి శిక్షణ ఇచ్చిన సంగీత ఉపాధ్యాయునికి రూ. 9,000 కలిపి మొత్తంగా రూ.12,500 లభించనున్నాయని, ఈ మొత్తం ప్రతి

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 18 (జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు శ్రీమతి రావుల పెద్ద ఎల్లమ్మ, శ్రీ భిక్షపతి, శ్రీమతి దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి , జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, హిమబిందు, డీఎల్పీవో శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి

## -ధర్మారంలో రూ.41 లక్షల సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి శంకుస్థాపన

## -ప్రజలకు రాకపోకలు సులభతరం

**శంకరపట్నం జూన్ 18 జనంసాక్షి**
మౌలిక వసతుల కల్పనతోనే గ్రామీణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలం ధర్మారం గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.41 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



**గ్రామాల్లో మౌలిక వసతులకే ప్రాధాన్యం**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సేవలు అందుబాటులో ఉంటేనే గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. గ్రామాలకు పట్టణాలకు సమానమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాల్లో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి పథకాలు చేపడుతున్నామని తెలిపారు. ధర్మారం గ్రామ అభివృద్ధికి కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ధర్మారంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రవి, పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, సర్పంచ్ చింతిరెడ్డి పద్మ, గ్రామశాఖ అధ్యక్షుడు కిష్టయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు గట్టు తిరుపతి, గోపగోని బస్వయ్య, ఉప్పుగళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు తమ పిల్లల్ని తాము పనిచేసే పాఠశాలలోనే చేర్పించడం శుభపరిణామం

### - జిల్లా విద్యాశాఖాధికారి రాము

**మల్లాపూర్,జూన్18(జనంసాక్షి)**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ఉన్నత పాఠశాల మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను జిల్లా విద్యాశాఖాధికారి రాము గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో మండల విద్యాశాఖ మంచి ప్రణాళిక,సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు అత్యుత్తమ బోధనతో మంచి ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా అధిక సంఖ్యలో విద్యార్థుల నమోదు చేపట్టి, నాణ్యమైన విద్య అందించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మల్లాపూర్‌లో పనిచేస్తున్న స్రవంతి అనే ఉపాధ్యాయురాలు తన ఇద్దరు పిల్లలను మూడవ తరగతి మరియు ఐదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విచారించి వంట సిబ్బందికి, అలాగే ప్రత్యేక అధికారి శ్రీలత కు తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి, మల్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, రాజేందర్, కేజీబీవీ ఎస్.ఓ. శ్రీలత, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో పై కప్పు మరమ్మతులో ఉంది

### - కే రామ్ గోపాల్ రెడ్డి (ఎస్ ఎం)

**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :**
పెద్దపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ క్యాంటీన్ లోపల బిల్డింగ్ పై కప్పు మరమ్మతు పనులు జరుగుతున్నాయని స్టేషన్ మేనేజర్ రామ్ గోపాల్ రెడ్డి గురువారం ప్రకటన చేశారు. ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బంది కలవకుండా పనులు జరుగుతున్నాయని త్వరలోనే మరమ్మత్ పనులు పూర్తవుతాయని తెలిపారు..



## ఆధునిక బస్ స్టాప్ ఉపయోగంలోకి తీసుకురావాలి

**మంథని, (జనంసాక్షి) :**
మంథనిలో వినియోగించకుండా పక్కకు పడినటువంటి ఆధునిక బస్ స్టాప్ ను వెంటనే అధికారులు స్పందించి వేరే చోటుకు మార్చాలని వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం దాదాపు మూడు లక్షల వ్యయంతో నిర్మించినటువంటి ఆధునిక బస్ స్టాప్ పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ చౌరస్తా వద్ద రోడ్డు పక్కన పడేసి నిరుపయోగంగా ఉందని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే దానిని ఉపయోగంలోకి తేవాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్ ప్రజా అవసరమైనటువంటి బస్టాప్ లను వినియోగంలోకి తేవాలని ఆయన తెలిపారు.

## లింగాపూర్ లో టీబి నిర్ధారణ పరీక్షలు

### -మొబైల్ ఎక్సరే యూనిట్‌తో టీబీ స్క్రీనింగ్

### -95 మందికి పరీక్షలు.. ముందస్తు గుర్తింపుతో నివారణే లక్ష్యం

**శంకరపట్నం, జూన్ 18 జనం సాక్షి:**
క్షయవ్యాధి (టీబీ) నివారణలో భాగంగా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో మొబైల్ ఎక్సరే యూనిట్ ద్వారా ప్రత్యేక టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మోరే స్వరూప, ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 95 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 71 మంది పెద్దలు, 24 మంది చిన్నారులు ఉన్నారు.

**అధిక ప్రమాదంలో ఉన్న వారికి ప్రాధాన్యం**
60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, గతంలో కుటుంబ సభ్యులకు టీబీ ఉన్నవారు, మధుమేహంతో బాధపడుతున్నవారు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి తొలి ప్రాధాన్యంతో మొబైల్ ఎక్సరే ద్వారా స్క్రీనింగ్ నిర్వహించారు. అనుమానితులకు తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించనున్నట్లు వైద్య అధికారులు తెలిపారు.

**-ముందస్తు గుర్తింపుతో వ్యాధి నియంత్రణ**
ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డా.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, టీబీని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని చెప్పారు. ప్రజలు రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇటువంటి స్క్రీనింగ్ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో టీబీ నియంత్రణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు డా.మనోచిత్ర, హెల్త్ సూపర్వైజర్ అనిల్ కుమార్, ఏఎన్ఎంలు సులోచన, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, ఎస్‌టీఎస్ శ్రీనివాస్ రెడ్డి, టీబీ కోఆర్డినేటర్ రాజబోస్, ఎక్సరే టెక్నీషియన్లు పాల్గొని పరీక్షల నిర్వహణలో సేవలందించారు.



# ప్రజల ప్రయాణ సౌకర్యానికి మరో ముందడుగు

## మెట్ పల్లి నుండి వేములవాడ కు నూతన బస్ ప్రారంభించిన విప్ ఆది శ్రీనివాస్

## పెగ్గర్ల లో జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

కథలాపూర్, జూన్ 18(జనం సాక్షి )
మెట్‌పల్లి నుండి పెద్దగుండు, కొనరావుపేట, ఊటుపల్లి, భూషణ్‌రావుపేట, చింతకుంట, తండ్రియాల ఎక్స్ రోడ్డు, రుద్రంగి, చందుర్తి మీదుగా వేములవాడ వరకు నూతన బస్సు సర్వీసును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ నూతన బస్సు సర్వీస్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి (రాజన్న) ఆలయానికి వచ్చే భక్తులకు కూడా ప్రయాణం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు మరియు రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ఈ బస్సు ద్వారా ఎంతో ప్రయోజనం పొందనున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి కూడా తోడ్పడేలా ఈ బస్సు సర్వీస్ అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఫంక్షన్ హాల్స్, గార్డెన్స్‌లో పనిచేసే తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు రోజుకు 800 వేతనం ఇవ్వాలి : సీఐటీయూ



**కరీంనగర్ టౌన్, జూన్ 18 ( జనంసాక్షి)**
కరీంనగర్ జిల్లాలోని ఫంక్షన్ హాల్స్, గార్డెన్స్‌లో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు రోజుకు 8 గంటల పనికి కనీసం ?800 వేతనం చెల్లించాలని సీఐటీయూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జిల్లాలోని పలు ఫంక్షన్ హాల్స్, గార్డెన్స్ మేనేజర్లకు వినతిపత్రాలు సమర్పించింది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, సెక్యూరిటీ గార్డుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పులు, వంట నూనెల ధరల కారణంగా కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెక్యూరిటీ గార్డులకు అందుతున్న వేతనాలు సరిపోవడం లేదని, అందువల్ల రోజుకు 8 గంటల పనికి కనీసం ?800 చెల్లించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ క్రమంలో రేకుర్తి ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్ మేనేజర్ శ్రీనివాస్, సాయి మహాలక్ష్మి గార్డెన్ మేనేజర్ అశోక్, శుభం గార్డెన్, వరలక్ష్మి గార్డెన్ మేనేజర్ కొమురయ్య, ఈఎన్ గార్డెన్ మేనేజర్ రామకృష్ణ తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రైవేట్ ఏజెన్సీలు, దళారులు, మధ్యవర్తులు సెక్యూరిటీ గార్డులను మోసం చేస్తున్నారని పున్నం రవి ఆరోపించారు. కార్మికులను అకారణంగా తొలగించడం, తక్కువ వేతనాలతో పని చేయించడం, చట్టబద్ధమైన కార్మిక హక్కులు కల్పించకపోవడం వంటి చర్యలు ఆందోళనకరమని అన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించిన గార్డుల స్థానాల్లో ఇతర కార్మికులు పని చేయకుండా సంఘీభావం చూపాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే సెక్యూరిటీ గార్డులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాలను తప్పనిసరిగా అమలు చేయాలని, నెలకు కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ను రద్దు చేసి కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి నోముల జగన్, పరుశురాం, సుంకరపల్లి ప్రవీణ్, మల్లయ్య తదితర నాయకులు, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు. సెక్యూరిటీ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు.



## అంటూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..
### నగర మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జనంసాక్షి :**
అంటువ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 46 వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు , ఈగలకు నిలయమై అంటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని అన్నారు. డెంగ్యూ , మలేరియా వంటి అంటు వ్యాధులు బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగవలసి వస్తుందని అన్నారు. కాబట్టి చెత్త బహిరంగ ప్రదేశాలలో , కాలువల్లో వేయకుండా నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలని కోరారు. కాగా ఈ సందర్భంగా సంజయ్ గాంధీ నగర్ రోడ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డుకు ఇరువైపులా దారికి అడ్డంగా పెరిగిన పొదలు , చెట్ల కొమ్మలు , నాలా శుభ్రం చేయడానికి వీలేకుండా పైన పరిచిన రాళ్ళను తొలగించారు , నాలాల లో పూడిక తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు , నగర పాలక సంస్థ అధికారులు నవీన్ , మీర్ , పబ్బాల శ్రీనివాస్ . సంపత్ , చంద్రా రెడ్డి , మెప్మా సి ఓ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందించాలి..
### జిల్లా కార్యదర్శి కొల్లూరి మల్లేశం..



**అంతర్గాం, జనంసాక్షి :**
"ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కార్యాలయం ముందు ధర్నా చేసి తహసీల్దార్కు రైతాంగ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి మల్లేశం మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు అవుతున్న రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్వామినాధన్ కమిషన్ సిఫారసు "మినిమం సపోర్ట్ ప్రైస్(ఎం.ఎస్.పి)" సీ2 ప్లస్ 50% ప్రాతిపదికన మద్దతు దర ఇచ్చి రైతులను 2022 కల్లా ధనిక రైతులను చేస్తానని చెప్పిన మాటలు పచ్చి మోసం అని తేలిపోయిందని, రైతులను నట్టేట ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి 750 మంది రైతులను బలి గొన్నారని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన తర్వాత యుద్ధం పేరు చెప్పి యూరియా, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిత్యవసర వస్తువుల రేట్లు పెంచడం మూలంగా రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, రైతాంగానికి తక్షణమే నాన్యమైన ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర నాయకులు మేరుగు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం, నాయకులు ఐ రాజేశం, గుండు రాజయ్య, మల్యాల దుర్గయ్య, పెగడపల్లి దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, పోగుల శేకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయలో ఇంటర్ ప్రవేశానికి సత్యశోధక్ విద్యార్థిని ఎంపిక



**సిరికొండ జూన్ 18 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026?27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ (11వ తరగతి) ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈ. లక్ష్మి సహస్ర ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.పదవ తరగతిలో 562 మార్కులు సాధించిన లక్ష్మి సహస్ర, జవహర్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించి ఇంటర్మీడియట్ విద్యకు ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పేర్కొన్నారు.ఈ విజయం విద్యార్థిని కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల సమర్థ మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

## మండలంలో ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలి



**ముస్తాబాద్ జూన్ 18 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం మొయినికుంట మాజీ గ్రామ సర్పంచ్ కల్వకుంట్ల వనజ గోపాల్ రావు పెళ్లిరోజు సందర్భంగా మొక్కలు నాటుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినరోజు పెళ్లిరోజు సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు మొక్కలు నాటి గ్రామాన్ని పచ్చదనంగా ఏర్పాటు చేసుకోవాలి. ఆప మొక్కలు, జామ మొక్కలు మామిడి మొక్కలు, చింత చెట్లు మర్రి చెట్లు, ఇలాంటి మొక్కలు నాటినట్లు అయితే గ్రామంలో ఉన్నటువంటి కోతులు ఉండయి మంచినీడనిస్తాయి పనులు ఇస్తాయి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి: గీట్ల ముకుంద రెడ్డి

**కరీంనగర్ టౌన్, జూన్ 18 ( జనం సాక్షి)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికుల రెండు రోజుల దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు ప్రారంభించారు. సుమారు 250 మంది కార్మికులు దీక్షల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. రెండో పీఆర్‌సీని ప్రకటించి కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచడంతో పాటు కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని, రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.శానిటేషన్, వాటర్ వర్క్స్, హరితహారం, ఎలక్ట్రిషియన్స్, డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రక్షణ పరికరాలు, చెప్పులు, గ్లౌజులు, బెల్లం, కొబ్బరి నూనె, రెయిన్‌కోట్లు, రెండు అప్రాన్లు అందించాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లు, జవాన్లకు డ్రైవర్ కేటగిరీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో విధులు నిర్వహించే కార్మికులకు రవాణా సౌకర్యం, విశ్రాంతి గదులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు తగిన ఆదాయ వనరులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలు రూపొందిస్తున్నాయని నాయకులు విమర్శించారు. స్థానిక సంస్థలే ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ జీఎస్టీ, పెట్రోల్, డీజిల్, మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో వాటా కల్పించడం లేదన్నారు. ఎల్ఆర్ఎస్ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాలో జమ చేసుకుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. రాజేశం, రాష్ట్ర మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపల్లి పోచయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు మానుపాటి మల్లేశం, కార్యదర్శి దేవునూరి శ్యాంసుందర్, నాయకులు దాసరి రాజమల్లయ్య, బందిలి తిరుపతి, బడిగల చంద్రయ్య, బి. వెంకటస్వామి, కొంకంటి పద్మ, పురత్తం రాధ, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**సుల్తానాబాద్,జూన్ 18(జనంసాక్షి) :**
మండలంలోని ఐతరాజు పల్లి లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం గ్రామ సర్పంచ్ ది కొండ భూమేష్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులు దాదాపు 150 మందికి పైగా పాల్గొని తమకు ఉన్న వివిధ వ్యాధులకు పరీక్షలు నిర్వహించుకున్నారు. శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేపట్టారు. అనంతరం సర్పంచ్ భూమేష్ తో పాటు వైద్య బృందం మాట్లాడుతూ, కరీంనగర్ లోని తమ మెడికవర్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకునే వారికి ఓపి ఉచితంగా అందిస్తామని



అలాగే వివిధ రకాల పరీక్షలకు మందులకు రాయితీ సైతం అందించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఈ సదవకాశాన్ని ఐతరాజు పల్లి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు న్యాతరి అరవింద్, గ్రామ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, డాక్టర్ల బృందం లోకేష్, మేనేజర్ గుర్రం కరుణాకర్, హరీష్, రఘు హాస్పటల్ సిబ్బందితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సుగ్లాంపల్లిలో అంగరంగ వైభవంగా
# గ్రామ దేవతల వేడుకలు
### - ఇంటింటా సంబరాలతో ప్రజలు

సుల్తానాబాద్,జూన్ 18(జనంసాక్షి) : మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు, సుగ్లాంపల్లి లో గ్రామ దేవత లైన పోచమ్మ బోనాలు, భూలక్ష్మి పట్నాల మహోత్సవ కార్యక్రమ వేడుకలను గత రెండు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కాలనీలో బుధవారం జోగు ఎత్తే కార్యక్రమాన్ని కాలనీ ప్రజలు నిర్వహించగా గురువారం కాలనీలో ఇంటికో బోనంతో బోనాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి బోనం ఎత్తుకొని స్థానిక పోచమ్మ ఆలయం వరకు చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. శుక్రవారం బలి పట్టి కార్యక్రమంలో భాగంగా గావు పట్టే కార్యక్రమాన్ని బైండ్ల పూజారులు చేపడతారని తెలిపారు. గ్రామ దేవతలు పోచమ్మ, భూలక్ష్మి తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. పట్నాల కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, తోపాటు కమిషనర్ తిప్పరాజురమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్, మాజీ కౌన్సిలర్ పసర్ల మమత సంపత్, పసిర్ల రవీందర్ లతోపాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.ఆలయ పరిసర ప్రాంతాలను మున్సిపల్ సిబ్బంది సుప్రపరిచారు.





## బొంపల్లి గ్రామంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ
**- ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు.జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే బొంపల్లి లో సర్వే చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు.తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం,స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు , మరియు ఆన్లైన్ ఆర్డర్స్ ,ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గ వర్కర్స్ జొమాటో,స్విగ్గి ,రాపిడో ,ఓలా,ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లోలి లిపనిచేసేటువంటి వ్యక్తుల యొక్క విషయాలను నమోదు చేసుకుంటామని తెలిపారు. కేంద్ర గణాక శాఖ నిర్వహిస్తున్న సర్వేలు నిరంతర ప్రక్రియ ,కావున ప్రజలు అందరూ గణాంక శాఖ అధికారులకు సహకరించాలి.ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక సంపత్ యాదవ్ ఉప సర్పంచ్ పంబాల రాజు మరియు వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్ కదారి కనక లక్ష్మి గ్రామ ఏఎన్ఎం నగూరి రాజేశ్వరి ఆశ వర్కర్ సంటి లలిత గ్రామపంచాయతీ సిబ్బంది సంటి శ్రీకాంత్,అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల నర్సరీల నిర్వహణలో నిబంధనలు పాటించాలి
### - గడ్డం శ్యాం ప్రసాద్.(గుణాంక శాఖ అధికారి)

**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలోని పలు కూరగాయల నర్సరీలను జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ గురువారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా నర్సరీలలో ఉత్పత్తి చేస్తున్న కూరగాయల నారు మొక్కల నాణ్యత, నిర్వహణ విధానాలు, రైతులకు సరఫరా చేస్తున్న మొక్కల వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన కూరగాయల నారు మొక్కలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. నర్సరీ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ ఆరోగ్యవంతమైన, తెగుళ్లు మరియు చీడపీడల రహితమైన నారు మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని సూచించారు.తెలంగాణ నర్సరీల నమోదు చట్టం--2017 ప్రకారం జిల్లాలోని అన్ని నర్సరీలు తమ లైసెన్సులను సకాలంలో పునరుద్ధరించుకోవాలని ఆదేశించారు.అలాగే విత్తనాల కొనుగోలు, నారు ఉత్పత్తి, నిల్వలు, విక్రయాలు, రైతులకు సరఫరా చేసిన మొక్కల వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.నర్సరీలలో నాణ్యత నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు విశ్వసనీయమైన మరియు ప్రమాణాలకు అనుగుణమైన నారు మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలను పాటించని నర్సరీలపై తెలంగాణ నర్సరీల నమోదు చట్టం--2017 ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.జిల్లాలో కూరగాయల సాగు విస్తరణకు, రైతులకు నాణ్యమైన నారు మొక్కల అందుబాటుకు ఉద్యాన శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి శ్రీ మహేష్, ఉద్యాన విస్తరణ అధికారి శ్రీ రాము పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికే అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
### - రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య

**కాల్వశ్రీరాంపూర్,జూన్ 17(జనంసాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికే అత్యధికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటున్నాయని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 4వ తరగతి చిన్నారి మేడి శాన్విత పుట్టినరోజు వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తన స్నేహితుల మధ్య చిన్నారి శాన్విత ఆనందోత్సాహాలతో పుట్టినరోజును ఘనంగా జరుపుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, ఎడ్ల ప్రవంతి, బండారి సరితలు చిరంజీవి శాన్వితను నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, విద్యాబుద్ధులతో విలసిల్లాలని వారు ఆమెను దీవించి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఈర్లసమ్మయ్య మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు, ఇతర రంగాల్లో కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉన్న వారందరూ 98 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని ఆయన గుర్తు చేశారు. ఇందుకు కారణం ప్రభుత్వ పాఠశాలల్లో కృత్యాధార, శాస్త్రీయమైన, నాణ్యమైన విద్యను అందించడమేనన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలలకు పంపించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడతాయని, అప్పుడు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సిండికేట్ అయి ఇష్టారాజ్యంగా లక్షల్లో ఫీజులు వసూలు చేసి, పిల్లల తల్లిదండ్రులను దోచుకునే సంస్కృతి అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థ అనేది ఒక వ్యాపార వ్యవస్థ అని, ప్రైవేట్ విద్యా వ్యవస్థ అనేది భవిష్యత్తు తరాలకు అంత మంచిది కాదని, అది ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ప్రజల సొమ్ముతో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు ఆదరించాలని, వాటిని కాపాడాలని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే కొన్ని తరాలపాటు ఆయా గ్రామాల ప్రజలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఈర్ల సమ్మయ్య హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులతో పాటు పిల్లలు, పలువురు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థిలో ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యంగా పనిచేయాలి
### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- ఎఫ్ఎల్ఎన్ “తొలిమెట్టు” కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

**- ఉపాధ్యాయులు బృందంగా పనిచేసి గత ఏడాదికంటే మెరుగైన ఫలితాలు సాధించాలి**

**పెద్దపల్లి,జూన్ 18(జనంసాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస నైపుణ్యాలను సాధించేలా లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యాశాఖ కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అందించి, ఎఫ్ఎల్ఎన్ “తొలిమెట్టు” కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

2026-27 విద్యా సంవత్సరానికి ప్రతి కాంప్లెక్స్ స్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, ఆయా కాంప్లెక్స్ల పరిధిలోని ప్రతి పాఠశాలకు ప్రత్యేక లక్ష్యాలు నిర్ణయించి వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందరూ ఒక బృందంగా పనిచేసి ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యాన్ని చేరుకోవాలని, విద్యా సంవత్సరం మొత్తం ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధిని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా స్వీకరించాలని, పాఠశాలల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే కాంప్లెక్స్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసుకుని, ఆ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, అకడమిక్ అధికారి పి.ఎం. షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గ్యాస్ వినియోగదారులు ఈనెల 30లోగా కేవైసీ పూర్తి చేసుకోవాలి

**భిక్కనూరు జూన్ 18 (జనం సాక్షి):**
భిక్కనూరు మండల కేంద్రంలో గల శ్రీహిత హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీలోని పట్టణ కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో వంటగ్యాస్ వినియోగదారులు ఏడాదిగా కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్న ఇంకా పూర్తి కాకపోవడంతో ఈనెల 30 తేదీలోగా కేవైసీ బయోమెట్రిక్ పూర్తి చేసుకోవాలని,ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత కేవైసీ బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే ఆతేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది,గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ కేవైసీ పూర్తయ్యే మధ్యకాలంలో తీసుకుని సిలిండర్ పైసబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్కులర్లో స్పష్టం చేసింది,గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్డేట్ చేయనివారు వెంటనే గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈప్రక్రియను పూర్తి చేసుకోవాలని అని ఏజెన్సీ నిర్వాహకులు రమేష్ రెడ్డి,శరత్ చంద్రారెడ్డి తెలిపారు.
ఫోటో 18 సుల్తానాబాద్ 06

# ఇందుర్తి ఫర్టిలైజర్ షాపులో ఆకస్మిక తనిఖీలు

**- నకిలీ విత్తనాలు,బిల్లుల్లేని విక్రయాలపై కఠిన చర్యలు.. - తనిఖీల్లో తిమ్మాపూర్ సిఐ రమేష్ హెచ్చరిక..**

**చిగురుమామిడి జూన్18 (జనంసాక్షి):**
రానున్న వానకాలం 2026సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందేలా మండల కేంద్రంలోని ఆగ్రోస్‌తో పాటు ప్రైవేట్ విత్తన దుకాణాల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వ్యవసాయ కమిషనర్,జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు స్థానిక సీఐ రమేష్,మండల వ్యవసాయ అధికారి (ఏఓ) తాటిపల్లి పున్నం చందర్‌రెడ్డి,ఎస్‌ఐ పృథ్వీధర్ గౌడ్‌లు తనిఖీల్లో నిర్వహించారు.దుకాణాల్లో ఉన్న ఎరువులు,విత్తనాల నిల్వలు, ధరల పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా సీఐ రమేష్,ఏఓ పున్నం చందర్‌రెడ్డి మాట్లాడుతూ లాభాపేక్షతో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడంతో పాటు నిల్వల వివరాలను రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.విత్తన ప్యాకెట్లు, ఎరువుల బస్తాల విక్రయాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, బిల్లుల్లేని విక్రయాలు జరిపితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఇతర అవసరాలకు అక్రమంగా మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్, ఎస్‌ఐ పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు. వానకాలం సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ పున్నం చందర్‌రెడ్డి తెలిపారు. మండలానికి అవసరమైన యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి, రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## సుధా హాస్పిటల్ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**-సర్పంచ్ కప్పల ప్రవీణ్**




ఎలిగేడు,జూన్ 18(జనంసాక్షి) :
ఎలిగేడు మండల కేంద్రంలో శుక్రవారం సుధా హాస్పిటల్ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ అన్నారు.ఈ కార్యక్రమం గ్రామ పంచాయతీ ఆవరణలో జూన్ 19-2026 శుక్రవారము రోజున సుధా హాస్పిటల్ వారు నిర్వహించబోయే ఉచిత వైద్య సేవలను చిన్న పిల్లల తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పిల్లల కు సబంధించిన ఎటువంటి సమస్యలు, అనుమానాలు,అపోహాలు,సందేహాలు ఉన్న అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రదించి తగిన సమాచారం పొందవచ్చని ప్రవీణ్ తెలిపారు.

# అక్రమ వెంచర్లపై ఉక్కు పాదం మోపిన గ్రామ పంచాయతీ పాలకవర్గం

- ○ లేఅవుట్లు లేకుండానే అక్రమ రిజిస్ట్రేషన్లు
- ○ చిన్నకల్వల రియల్ ఎస్టేట్లో అవినీతి అక్రమాలు
- ○ అధికారుల అండదండలతో రిజిస్ట్రేషన్లు
- ○ నోటీసులు జారీచేసిన పట్టించుకోని రియాల్టర్లు
- ○ ట్రాక్టర్లతో చదును చేసిన వైనం



**సుల్తానాబాద్,జూన్ 18(జనంసాక్షి) :**
మండలంలోని చిన్నకల్వల గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సర్వే నెంబర్లలో ఎలాంటి లేఅవుట్లు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ రిజిస్ట్రేషన్ ల దందా నడిపిస్తుండడంతో, చిన్నకల్వల గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉక్కు పాదం మోపింది. గత నెల రోజుల కింద పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీచేసిన రియాల్టర్లు, పట్టించుకోకపోవడంతో బుధవారం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్యదర్శి సంబంధిత అక్రమ వెంచర్లపై హద్దు కనీలను తొలగించి ట్రాక్టర్లతో చదును చేయించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు చుక్క రాజమౌళితోపాటు పలువురు మాట్లాడుతూ, చిన్నకల్వల గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సర్వే నంబర్లలో దాదాపు పది ఎకరాలలో అక్రమ వెంచర్లను ఏర్పాటు చేశారని, నాలుగు ఎకరాలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేవని, వ్యవసాయ భూములుగానే ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారుల అండదండలతో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడు తున్నారని, ద్వారా కొనుగోలు చేస్తే నష్టపోతారని స్పష్టం చేశారు. తద్వారా గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారని మండిపడ్డారు. గ్రామపంచాయతీ అనుమతులు లేఅవుట్లు లేకుండా ఎలాంటి కొనుగోలు జరపరాదని ప్లెక్సీ బ్యానర్ను వెంచర్లలో ఏర్పాటు చేశారు. అక్రమ వెంచర్ల ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చిన్నకల్వల గ్రామంలో వెలిసిన అక్రమ వెంచర్లు లేఅవుట్ చేసి గ్రామపంచాయతీ అనుమతులను తీసుకోవాలని, లేనియెడల అక్రమంగా చేస్తున్న రిజిస్ట్రేషన్ లపై ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సంబంధిత తహసిల్దార్ సబ్ రిజిస్టర్లు చిన్నకల్వల వెంచర్లకు సంబంధించి నియమ నిబంధనలు పాటించేంతవరకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని, తాసిల్దార్ కు సబ్ రిజిస్టర్ కు వినతిపత్రం సమర్పిస్తామని వారు తెలిపారు.

## హుస్సేమియా వాగు నుండి అక్రమ ఇసుక తరలింపు

**- అడ్డుకున్న గ్రామస్తులు**

**సుల్తానాబాద్,జూన్ 18(జనంసాక్షి) :**
అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది మట్టి, ఇసుక అక్రమంగా తరలించే మాఫియా లు చివరకు చిన్నచిన్న వాగు లను సైతం వదలడం లేదు ఎక్కడ మట్టి నిల్వలు ఉన్న ఇసుక కనిపించిన తరలించి వాటిని సొమ్ముగా చేసుకునే అక్రమార్కులు మండలంలో రోజురోజుకు పెరిగిపోతున్నారు. మానేరు పరివాహక ప్రాంతం నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రత్యేక చొరవతో శాంటాక్స్ ని ఎత్తివేసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఇసుకను గృహ అవసరాలకు తరలించుకునే అవకాశాన్ని కల్పించి మానేరు పరివాహక ప్రాంతా ఇసుక ట్రాక్టర్ యజమానులకు చక్కటి అవకాశాన్ని కల్పించి రవాణాను కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ కొందరు అక్రమార్కులు వాగు నుండి ఇసుక ను రాత్రి వేళలో తమ గృహాల వద్ద డంపు చేసుకొని రాత్రి సమయంలో విక్రయిస్తూ తిరిగి ఉదయం మళ్లీ వాగు నుండి ఇసుకను తరలిస్తున్నారు.మరికొందరు ఏకంగా చిన్నచిన్న వాగు లను సైతం వదిలిపెట్టడం లేదు మండలంలోని చిన్న కల్వల హుస్సేమియా వాగులో సైతం ఇసుకను సైతం గత కొద్ది రోజులుగా ట్రాక్టర్ల ద్వారా తలిస్తున్నారు. గ్రామ ప్రజలు అడ్డుకొని ఇసుకను తరలించవద్దని భూగర్భ జలాలు అడుగంటి పోతాయని వాగు పై ఆధారపడి ఉన్న వ్యవసాయం సైతం కుంటూ పడిపోతుందని ట్రాక్టర్ యజమానులకు ఎన్నిసార్లు వివరించిన పెడచెవిన పెడుతూ ఇసుకను తరలిస్తున్నారని దీనిపై ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఇసుక తరలింపును అడ్డుకొని అక్రమంగా తరలించిన ట్రాక్టర్ యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## మున్నూరు కాపు సుల్తానాబాద్ మండల కన్వీనర్ గా గొట్టం మహేష్ నియామకం

సుల్తానాబాద్,జూన్ 18(జనంసాక్షి) :
తెలంగాణ మున్నూరు కాపు సంఘం సుల్తానాబాద్ మండల కన్వీనర్ గా పట్టణానికి చెందిన గొట్టం మహేష్ నియామకం అయ్యారు. నియామక పత్రాన్ని జిల్లా కన్వీనర్ పెంట రాజేష్ అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గొట్టం మహేష్ మాట్లాడుతూ మండలంలో మున్నూరు కాపు సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర జిల్లా కన్వీనర్లకు గొట్టంమహేష్ కృతజ్ఞతలు తెలిపారు.



# తెలంగాణకు ప్రమాదం పొంచి ఉంది.. అప్రమత్తంగా ఉండాలి: కవిత

**కరీంనగర్ టౌన్, జూన్ 18 ( జనంసాక్షి)**

తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు?సాధన రౌండ్ టేబుల్ సమావేశం ముగింపు సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రమాదం పొంచి ఉందని, రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ రాజకీయ వ్యూహం పనిచేస్తోందని ఆరోపిస్తూ, తెలంగాణలో పరోక్షంగా పాగా వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో సంవత్సరాలు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేసిన కవిత, ఇప్పుడు మరోసారి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. బీజేపీ నేరుగా పోటీ చేస్తే ప్రజల ఆదరణ లభించదనే ఉద్దేశంతో పవన్ కళ్యాణ్‌ను ముందుకు తెస్తోందనే అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.

జీహెచ్ఎంసీ పరిధి విస్తరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, చుట్టుపక్కల ప్రాంతాలను విలీనం చేయడం వెనుక కూడా రాజకీయ కుట్ర ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎదురవుతున్న ప్రమాదాలను వివరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని అవమానించే శక్తులను ప్రజలు గుర్తించాలని కోరారు.పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేసిన కవిత, ఆయనను రాజకీయ నాయకుడిగా కాకుండా సినిమా నటుడిగా మాత్రమే చూడాలని యువతకు సూచించారు. సినిమా నటుల డ్యాన్సులు, ఫైట్లు చూసి వినోదం పొందవచ్చని, కానీ రాజకీయంగా వారి ప్రభావానికి లోనుకావద్దని కోరారు. సినిమా రంగానికి చెందిన వ్యక్తులను "ఎంటర్‌టైన్‌మెంట్ ఫ్యాక్టర్స్"గానే చూడాలని, రాజకీయ నిర్ణయాలు ప్రజల ప్రయోజనాల ఆధారంగా తీసుకోవాలని సూచించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల



పరిరక్షణ అంశాన్ని ప్రస్తావిస్తూ, బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక దేవతల ఆరాధన వంటి ప్రత్యేక సంప్రదాయాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన దేవుడిని పూజించే స్వేచ్ఛ ఉన్నదని, అలాంటి వైవిధ్యభరిత సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ రూపంలో బీజేపీ "మేక వన్నె పులి"లా వస్తోందని, ప్రజలు ఈ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలని కోరారు.రాజకీయాల విషయానికి వస్తే, టీఆర్ఎస్-2లో కోటరీ రాజకీయాలకు తావు ఉండదని కవిత స్పష్టం చేశారు. గతంలో తాను కూడా కోటరీ రాజకీయాలకు బలైన వ్యక్తినేనని పేర్కొంటూ, పార్టీలోని ప్రతి కార్యకర్తకు తనతో నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో "హార్ట్ టు హార్ట్" రాజకీయాలకు శ్రీకారం చుడతామని చెప్పారు.టికెట్ల కేటాయింపులో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇస్తామని, తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేసిన వారికి అవకాశాలు కల్పించే రాజకీయాలకు తాము దూరమని అన్నారు. ఎన్నికల ఖర్చులను తగ్గించే రాజకీయ సంస్కృతి రావాలని, బీసీలు, ఎస్సీలు సాధారణ స్థానాల నుంచే గెలిచే పరిస్థితి ఏర్పడాలని అభిప్రాయపడ్డారు.మహిళలకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించిన కవిత, తమ పార్టీ తరఫున కనీసం 33 శాతం టికెట్లను మహిళలకు కేటాయిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో 50 శాతం వరకు మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటి హామీలను కూడా సమగ్ర అధ్యయనం, నిపుణులతో చర్చల అనంతరమే ప్రకటించామని తెలిపారు.అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్లే రాజకీయాలకే తమ పార్టీ కట్టుబడి ఉంటుందని కవిత పేర్కొన్నారు. మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యమకారులు, వివిధ సామాజిక వర్గాల సూచనలను స్వీకరిస్తూ ప్రజా కేంద్రిత రాజకీయాలు చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆరు కీలక తీర్మానాలను ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయం అందించాలని, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగించాలని, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని, తెలంగాణ ద్రోహులకు మద్దతు ఇచ్చే వారిని కూడా ప్రజలు తిరస్కరించాలని తీర్మానించినట్లు తెలిపారు.అలాగే కరీంనగర్ జాలిగుట్ట ప్రాంతంలో ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థల పట్టాలు పంపిణీ చేయాలని, కరీంనగర్ పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసినట్లు కవిత వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తి పరిరక్షణ కోసం సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు.



# ఇందిరమ్మ ఇళ్ల కోసం మట్టి అనుమతిపై తహసీల్దార్‌కు వినతి

**మంథని, (జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మట్టి కొరత కారణంగా నిలిచిపోవడంతో, గ్రామంలోని పేద లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్ సంబంధిత అధికారులను ఆశ్రయించారు. కమాన్‌పూర్ పెద్ద చెరువు నుంచి మట్టిని తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని బేస్‌మెంట్ స్థాయి వరకు పూర్తి చేసినప్పటికీ, మట్టి అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లక్ష్యాలు నెరవేరడంలో జాప్యం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

ఈ సమస్యపై తక్షణమే స్పందించిన సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, పంచాయతీ సెక్రెటరీ రాము, వార్డు సభ్యులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. గ్రామ ప్రజల అవసరాలు, లబ్ధిదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పెద్ద చెరువు నుంచి మట్టి తరలింపునకు అనుమతి కోరాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకునే దిశగా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా అధికారులు సహకరించాలని కోరారు. చెరువు నుంచి మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి లభిస్తే వందలాది మంది లబ్ధిదారులకు ఊరట లభిస్తుందని, నిర్మాణ పనులు వేగవంతమవుతాయని తెలిపారు.

# పలు శుభకార్యాలలో పాల్గొన్న సర్పంచ్

**రామగిరి జనం సాక్షి :**







రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు గురువారం గ్రామంలో జరిగిన పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. కెక్కర్ల సారయ్య? రజిత దంపతుల కుమార్తె వివాహ వేడుకలకు, అలాగే రాంనగర్‌కు చెందిన బత్తిని శ్రీనివాస్? భాగ్యలక్ష్మి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు, వార్డు సభ్యుడు పున్నం మణితేజ, స్థానిక నాయకులు సందేవేణ కుమార్, పబ్బ మొగిలి, సోమారపు కనకయ్య, జంగేటి కుమార్, పబ్బ వెంకటేష్, కెక్కర్ల రమేష్, బండారి లింగయ్య, ఇజ్జగిరి సంపత్, ముదుసు నరసయ్య, బెజ్జాల శంకర్, చెలుకల ఆదిత్య, దాసరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు ప్రారంభం

**పెద్ద కొడప్గల్ జూన్ 18 (జనంసాక్షి):**



పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనిలో గురువారం మిషన్ భగీరథ పైపు లైన్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్యామప్ప పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు కాలనీ సమస్యలు తెలపగానే వెంటనే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

రామగిరి జనం సాక్షి 01 : రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, తో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో పన్నూరు క్రాస్ రోడ్ నుండి ఓసీపీ-1 ఫేస్-2 వరకు రోడ్డు వేయడం, సెంటినరీ కాలనీ డిస్పెన్సరీ నందు రెండు ఏసీ లను, ఫిజియోథెరపీ రూమ్ ఏర్పాటు చేయడం, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఉన్న యోగా మందిరం పై రేకులు మార్చి ఫ్లోర్ టైల్స్ వేయడం, ఓసీపీ-1, ఓసిపి-2, ఏ ఎల్ పి లో ఉన్నటువంటి స్క్రాప్ ని సేల్ చేయడం, జీడీకే-10 వ గని మూసి వేస్తున్నందుకుగాను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఓ సి -1, ఓసి -2 కు బదిలీ చేయడం, సీఎం పిఎఫ్ లో కొత్త విధానం 2018 నుండి పేమెంట్ టైటిల్స్ ఉంటేనే పెన్షన్ ఇస్తామని అంటున్నారని, వెంటనే పరిష్కారం చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇబ్బంది పడకుండా చూడడం, డంపర్లు, డోజర్లు, షావల్స్, లలో ఉన్న పాత ఏసీలను మరమ్మతులు చేయడం వల్ల ఖర్చు ఎక్కువ అవుతుందని అయినా సరిగా పనిచేయడం లేదని కొత్త ఏసీలను అమర్చాలని, జీఎం కార్యాలయం, ఓసిపి-1, ఓసిపి-2, అడ్రియాల లాంగ్ వాల్ లలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, ఓసిపి-2 ఉపరితల గని నుండి మెయిన్ రోడ్డు కు వెళ్లే రోడ్డుపై ఆర్ అండ్ బి వారిచే స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయించడం, అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో గల ఆర్వో ప్లాంట్ను మరమ్మతులు చేయించడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు ఎ.రామారావు, తిరుపతి, సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస్ రావు, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్, ఐ ఇ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్ర శేఖర్, మేనేజర్ కె.వి.రామరావు, డివైపియం వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి సీసీఆర్‌టీ సాంస్కృతిక స్కాలర్‌షిప్‌కు

# ఎంపికైన పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు

**కరీంనగర్ అర్బన్, జూన్ 18 (జనంసాక్షి) :**
కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్' (సి.సి.ఆర్.టి.) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్ (2025-26)" కు స్థానిక కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల కు చెందిన 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ఎంపికయ్యాడని పాఠశాల డైరెక్టర్ రష్మిత తెలిపారు. దక్షిణ భారతదేశం మొత్తం మీద కేవలం నలుగురు (4) విద్యార్థులు మాత్రమే



ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికవగా, తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక విద్యార్థిగా కిట్ల చరణ్ ఘనత సాధించారని తెలిపారు. ఈ ఎంపికలో భాగంగా చరణ్‌కు అతని డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తయ్యే వరకు ప్రతీ సంవత్సరం ఈ జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి గాను విద్యార్థి చరణ్‌కు రూ.3,500, అతనికి శిక్షణ ఇచ్చిన సంగీత ఉపాధ్యాయునికి రూ. 9,000 కలిపి మొత్తంగా రూ.12,500 లభించనున్నాయని, ఈ మొత్తం ప్రతి సంవత్సరం పెరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన పాఠశాలకే కాకుండా రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన కిట్ల చరణ్ ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, వినోద్ రావు, వి.యు.ఎమ్. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత మరియు సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మలు విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# దమ్ముంటే రాజీనామా చేయాలి

### మంత్రి లక్ష్మణ్‌కు కొప్పుల ఈశ్వర్ సవాల్



**కరీంనగర్ టౌన్, జూన్ 18 ( జనంసాక్షి)**
సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, షూస్, యూనిఫాంలు, ప్లేట్లు తదితర సామగ్రి కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం పిలిచిన సుమారు రూ.2,000 కోట్ల విలువైన టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియను ముందుగానే కొందరికి అనుకూలంగా రూపొందించి నిర్వహించినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధారాలతో ఈ అంశాన్ని బయటపెట్టారని పేర్కొన్న ఆయన, ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం, సంబంధిత మంత్రులు మరియు ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ప్రతిపక్షాలు మాత్రమే కాదు, సాధారణ ప్రజలు ప్రశ్నించినా సమాధానం ఇవ్వడం ప్రభుత్వ కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. టెండర్ల వ్యవహారంపై ప్రశ్నించగానే ప్రభుత్వం, మంత్రులు అసహనానికి గురవుతున్నారని, సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఒకవేళ ఎలాంటి అవినీతి జరగలేదని ప్రభుత్వం భావిస్తే, సిట్ లేదా రిటైర్డ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించి నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.గతంలో స్థానిక చిన్న, మధ్య తరహా సంస్థలకు, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఎంఎస్ఎంఈలకు టెండర్లలో ప్రాధాన్యం కల్పించేవారని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుతం స్థానిక సంస్థలను పూర్తిగా పక్కనబెట్టి ఢిల్లీ, ముంబై, గుజరాత్ తదితర ప్రాంతాలకు చెందిన కంపెనీలకు టెండర్లు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు.
ప్రభుత్వం టెండర్లలో పేర్కొన్న ధరలు మార్కెట్ ధరల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని చెబుతూ, ఫినాయిల్, పామ్ ఆయిల్, కందిపప్పు, చక్కెర తదితర వస్తువుల ధరలను ఉదాహరణగా చూపించారు. ఈ ధరల వ్యత్యాసం ద్వారా వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జనవరి నెల నుంచే పాఠశాలలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ తదితర సామగ్రి సరఫరా ప్రక్రియ పూర్తిచేసి, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు అందించేవారని తెలిపారు.
కానీ ప్రస్తుత ప్రభుత్వం హడావుడిగా, కేంద్రీకృత విధానంలో టెండర్ల ప్రక్రియను నిర్వహించి కొంతమందికే లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరించిందని ఆరోపించారు. గతంలో ఈ టెండర్లు స్థానిక వ్యాపారులు, పరిశ్రమలకు దక్కి ఉపాధి అవకాశాలు కల్పించేవని, ఇప్పుడు ఇతర రాష్ట్రాల కంపెనీలకు అప్పగించడం వల్ల తెలంగాణకు చెందిన అనేక చిన్న వ్యాపారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న లక్షలాది మంది పేద విద్యార్థుల పేరుతో భారీ స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్, ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హరీష్ రావు ప్రజల చేత ఎన్నోసార్లు ఎన్నికైన ప్రజానాయకుడని, ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే సహకారంతో ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తాం

### రామగుండం నగర పాలక సంస్థ మేయర్ స్వామి..



**గోదావరిఖని, జనంసాక్షి :**
ఎంఎల్ఎ సహకారంతో ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హామీ ఇచ్చారు.గురువారం ఆయన ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ హిమబిందు సింగ్ , ఆర్ ఎం ఓ కృపా బాయ్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి నోటు పుస్తకాలు ,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తరచుగా విద్యుత్ సమస్య తలెత్తుతుందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎన్ పి డి సి ఎల్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని ఒక ప్రదాన వైద్య కేంద్రంగా తీర్చి దిద్దాడానికి ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని , ఆయన ఆశయాలకు అనుగుణంగా పేషంట్లకు ఉత్తమ వైద్య సేవలందించాలని అన్నారు. అత్యవసర సమయంలో త్వరితగతిన స్పందించాలని అన్నారు. పేషంట్లు , వారి బంధువులతో ఓర్పుగా నడుచుకుంటూ వారికి మనో ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ కంకణాల మౌనిక భర్త రాజును పరామర్శించారు. వైద్య చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్ గట్ల రమేష్ , యుగంధర్ , వైద్యులు నాగి రెడ్డి తదితరులు ఉన్నారు.

# సింగరేణి పర్సనల్ విభాగం పనితీరుపై సమగ్ర సమీక్ష..

### పెండింగ్ అంశాల పరిష్కారానికి వేగం పెంచాలి.. జీఎం (పర్సనల్ అండ్ ఐఆర్) కవిత నాయుడు..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి సంస్థలో ఉద్యోగుల సేవా, సంక్షేమ, పరిపాలనా అంశాల పరిష్కారంలో పర్సనల్ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీఎం (పర్సనల్ అండ్ ఐఆర్) శ్రీమతి కవిత నాయుడు సూచించారు. పర్సనల్ విభాగానికి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష సమావేశం బుధవారం ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించబడింది. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల పర్సనల్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా సంస్థలోని అన్ని ఏరియాల పర్సనల్ విభాగాల పనితీరు, ఉద్యోగుల హాజరు-గైర్హాజరు వివరాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన అంశాలు, వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియ, విజిలెన్స్ కేసుల పురోగతి, కార్మిక సంఘాలతో సంబంధాలు, ఉద్యోగుల సంక్షేమ సమస్యలు, సేవా అంశాలు, పరిపాలనా వ్యవహారాలపై విస్తృతంగా సమీక్ష చేపట్టారు. ప్రతి అంశానికి సంబంధించిన పురోగతి నివేదికలను పరిశీలించి, సమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ఉద్యోగుల వినతులు, సేవా సంబంధిత సమస్యలు మరియు ఇతర పరిపాలనా అంశాలను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించడంలో పర్సనల్ విభాగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి సమస్యను సానుకూల దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
సంస్థలో క్రమశిక్షణ, పారదర్శకత, సమన్వయంతో కూడిన పరిపాలనకు పర్సనల్ విభాగం వెన్నెముకలాంటిదని పేర్కొన్న కవిత నాయుడు, ఉద్యోగుల సేవా విషయాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా సంస్థపై ఉద్యోగుల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని తెలిపారు.
అదేవిధంగా పదోన్నతులు, విజిలెన్స్ కేసులు, కార్మిక సంబంధిత అంశాల్లో నిబంధనలకు అనుగుణంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్రత, పరిపాలనా సామర్థ్యాల పెంపు దిశగా పర్సనల్ విభాగం మరింత చురుకుగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నాగుల వేణు, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, హనుమంతరావు, వివిధ గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ విభాగ సిబ్బంది, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు



## ఇంటర్మీడియట్ కామర్స్, అకౌంటెన్సీ పుస్తకాల సహ-రచయితగా డాక్టర్ ఎం. మల్లారెడ్డి



**కరీంనగర్ టౌన్, జూన్ 18 ( జనంసాక్షి)** ప్రస్తుత విద్యా సంవత్సరం 2026-27కు ఇంటర్మీడియట్ విద్యా మండలి సవరించిన సిలబస్‌కు అనుగుణంగా రూపొందించిన కామర్స్, అకౌంటెన్సీ పాఠ్యపుస్తకాల సహ-రచయితగా కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల కామర్స్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. మల్లారెడ్డి సేవలందించారు.తెలుగు అకాడమీ రూపొందించిన మొదటి సంవత్సరం కామర్స్, అకౌంటెన్సీ తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠ్యపుస్తకాల రచనలో ఆయన కీలక పాత్ర పోషించారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఏసీఈ కోర్సుకు సంబంధించిన కామర్స్, అకౌంటెన్సీ పుస్తకాల సహ-రచయితగా వ్యవహరించారు. ఇంటర్మీడియట్ బోర్డు సిలబస్ సవరణ కోసం ఏర్పాటు చేసిన కామర్స్, అకౌంటెన్సీ విషయ నిపుణుల కమిటీలో కూడా సభ్యుడిగా కొనసాగడం విశేషం.ఈసారి రూపొందించిన పాఠ్యపుస్తకాల్లో విద్యార్థుల్లో పఠనాసక్తి, విషయ పరిజ్ఞానం పెంపొందించేలా రంగురంగుల డిజైన్‌లు, ప్రముఖుల విజయగాథలు, 'మీకు తెలుసా..మీ పరిజ్ఞానాన్ని పరీక్షించుకోండి కేస్ స్టడీస్, విద్యార్థి కార్యచరణలు, పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోల కోసం క్యూఆర్ కోడ్లు వంటి అంశాలను చేర్చినట్లు డాక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ పుస్తకాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు శంకరయ్య, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి సంపాదకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ కూరపాటి వెంకట నారాయణ, డైరెక్టర్ దేవసేన, ఇంటర్మీడియట్ కమిషనర్ అభిలాష్ అభినవ్‌లకు డాక్టర్ మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ మల్లారెడ్డిని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ పీ. నితిన్, టి. రాజయ్య, ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి సహా అధ్యాపక బృందం అభినందించారు.

## వీణవంక మల్లారెడ్డిపల్లి లో సీసీ రోడ్లను ప్రారంభించిన మల్లారెడ్డిపల్లి సర్పంచ్‌కొలిపాక రజిత



**వీణవంక జూన్ 18 (జనంసాక్షి)** వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ సీసీ రోడ్డు పనులు గురువారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్డు పనులు మంజూరు కావడంలో సహకరించిన కరీంనగర్ ఎంపీ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.వారు మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని,గ్రామ అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరుతూ,ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అర్సం శ్రీనివాస్,మూడో వార్డు సభ్యులు కర్రె నాని,మేకల కొండల్ రెడ్డి,గోనెల పెద్దలు,రాయనవేని తిరుపతి,గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ ప్రీ-ప్రైమరీ కార్యక్రమానికి శ్రీకారం

### చిన్నారుల తొలి అడుగులకు డి ఈ ఓ కె. రాము ఆశీస్సులు

**కథలాపూర్ జూన్ 18 (జనం సాక్షి )**
జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి (డి ఈ ఓ ) శ్రీ కె. రాము కథలాపూర్ మండలంలోని ఎంపీపీఎస్ తాండ్రియల్ పాఠశాలను సందర్శించి, పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ కార్యకలాపాలను పరిశీలించి అభినందించారు. ప్రీ-ప్రైమరీ పిల్లల కోసం రూపొందించిన ఆకర్షణీయమైన అభ్యాస వాతావరణం, ఆటల ఆధారిత బోధన, రైమ్ టైం, స్టోరీ టైం, ప్రీ-న్యూమరసీ మరియు ప్రీ-రైటింగ్ కార్యకలాపాలను ఆయన ప్రశంసించారు.ప్రీ-ప్రైమరీ కార్యక్రమం మొదటి రోజు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రతి చిన్నారి యొక్క "మొదటి అడుగు"(ఫుట్ ప్రింట్ ) ను ప్రత్యేకంగా తీసుకొని పాఠశాల రికార్డులలో భద్రపరిచారు. ఈ వినూత్న కార్యక్రమం తల్లిదండ్రులను, అధికారులను ఎంతో ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా డి ఈ ఓ శ్రీ కె. రాము తన కుమార్తె గుండు వీయాను అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని చాటిన శ్రీ గుండు విజయ్ కుమార్ ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ (ఎస్ ఓ ), శ్రీ మందా చంద్రశేఖర్ రెడ్డి (ఏ ఎమ్ ఓ ), శ్రీమతి నీరజ (కేజీబీవీ ఎస్ ఓ ), శ్రీ కిషన్ రావు (ఎస్ సి ఎక్స్ ప్రధానోపాధ్యాయుడు), శ్రీ ప్రసాద్ (సి ఆర్ పి ), ఉపాధ్యాయులు రవి,నరేష్, సత్య,మధు,అనూష, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## అనంతారంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**ఇల్లంతకుంట జూన్ 18(జనంసాక్షి)**
ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవత పోచమ్మ బోనాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బయలుదేరగా,యువకులు కేరింతలు కొడుతూ వేడుకలకు ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. శివశక్తుల పూనకాల నడుమ గ్రామదేవత పోచమ్మ ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని,ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల వేడుకల్లో గ్రామ ప్రజలు,మహిళలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

## సర్ ను పక్కబందీగా నిర్వహించాలి

### బోధన్ ఆర్డీవో విజయ కుమారి



**బోధన్, జూన్ 18 ( జనంసాక్షి ) :** సర్ ను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి కోరారు. గురువారం లయన్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మాస్టర్ ట్రైనీ లు కలిసి, సర్ ప్రక్రియలో గల పూర్తి సూత్రాలను వివరించారు. పాటించాల్సిన నిబంధనలు, వోటర్ జాబితాను రివైజ్ చేసే క్రమంలో ఉపయోగించే మొబైల్ యాప్ ను వాడే పద్ధతి వివరించారు. సరియైన వోటర్ లను గుర్తించి మాపింగ్ చేసే విధానం, సరికాని ఓటర్లను గుర్తించి తీసుకోవాలన్న తదుపరి చర్యల గురించి, మొదలగు నియమ నిబంధనల పైన విస్తృతంగా చర్చించారు. బీఎల్వోల నుండి సందేహాలను స్వీకరించి, వాటికి తగు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్వో లు, సూపర్ వైజర్లు, తహసీల్దార్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెర్లుమద్ది గ్రామంలో నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం

**ముస్తాబాద్ జూన్ 18( జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు. గ్రామ సర్పంచ్ బైకి దుర్గమ్మ నవీన్ ఆధ్వర్యంలో నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కూరగాయలు అమ్ముకోవడానికి రైతులు సిద్దిపేట, ముస్తాబాద్ గ్రామాలకు వెళ్లడం జరుగుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే అమ్ముకోవడానికి కూరగాయల మార్కెట్ ప్రారంభించడం జరిగింది. గ్రామస్తులు కూడా దూర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలు తెచ్చుకోవడం జరుగుతుంది వారిని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం చేపట్టాం. గ్రామ పంచాయితీ నిధులతో సుమారు రూ. 2 లక్షల వ్యయంతో నిర్మించిన రోజువారీ కూరగాయల మార్కెట్‌ను ఘనంగా ప్రారంభించారు.గ్రామ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో కూరగాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ఈ మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశం కలగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సౌజన్య, వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం మహేష్, నెత్తేట్ల రమాదేవి, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, అంతడుపుల మంజుల దేవయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, గోక దివ్యస్వామి, మామిండ్ల కానుకవ్వ శ్రీనివాస్ తో పాటు గ్రామ ప్రజలు, కూరగాయల వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి ఇన్సూరెన్సు" చెక్కుల అందజేత



**ఇబ్రహీంపట్నం, జూన్ 18,(జనం సాక్షి )** మండలం లోని ఎర్దండి గ్రామానికి చెందిన కాయిపెల్లి రాధ, ధ్యానవేణి కొండయ్య ప్రధాన మంత్రి ఇన్సూరెన్సు తీసుకుని దురదృష్టవశాత్తు మరణించగా, నామినీగా ఉన్న వారి కుటుంబ సభ్యులకు రూ 2 లక్షల రూపాయల చెక్కులను వారి కుటుంభ సభ్యులైన కాయిపెల్లి దిలీప్, ధ్యానవేణి పద్మకి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గోపిక్రిష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ గోపి కృష్ణ మాట్లాడుతూ ప్రజలందరు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన పిఎం జె జె బి వై, పి ఎం ఎస్ బి వై పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్బిఐ వీడ్స్ కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామసర్పంచ్ కల్లెడ గంగాధర్ మాట్లాడుతూ కుటుంబ పెద్ద మరణించి నపుడు ఆ కుటుంబం ఆర్థికంగా నష్టపోకుండా ఆ కుటుంబానికి ఈ ప్రభుత్వ ఇన్సూరెన్సు స్కీమ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తెడ్డు రాజరెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా ఉండే ఇటువంటి ఇన్సూరెన్సు పథకాలు ప్రజలందరూ తప్పకుండ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ బీజేపీ నాయకులు దాసరి రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధానమంత్రి భీమయోజన, ప్రధానమంత్రి సురక్ష భీమయోజన, రూపే కార్డు ఇన్సూరెన్సు, లేబర్ కార్డు, సుకన్య సమృద్ధియోజన, అటల్ పెన్షన్ మరెన్నో పథకాలు నరేంద్ర మోదీ పేద ప్రజలకోసం తెచ్చారని వాటిని దేశ ప్రజలందరూ ఉపయోగలించుకుని తమ కుటుంబాలకు అండగా నిలువాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నిరోషా, హెల్త్ ఆఫీసర్ రూపేష్, పురుషోత్తం సర్, ఆర్బిఐ వీడ్స్ కౌన్సిలర్లు రాజేష్, రజిని, సౌమ్య, బీజేపీ నాయకులు దాసరి రాజేందర్, భాశెట్టి రాజేందర్, జి పి సిబ్బంది రతన్, గంగాధర్, గాయిత్రి, వనిత పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ, మలేరియా నియంత్రణ సాధ్యం

## మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి





**మెట్ పల్లి జూన్ 18(జనం సాక్షి )**
మెట్‌పల్లి మండలంలో వెక్టర్ జనిత వ్యాధుల నివారణపై గురువారం సమన్వయ సమావేశం నిర్వహించడమైనదని మెట్‌పల్లి మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి తెలిపారు.మండలంలోని డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వెక్టర్ జనిత వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో భాగంగా వైద్యాధికారి డా. అంజిత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉన్న నిల్వ నీటి వనరులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి, చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీఓ శ్రీ ప్రదీప్ గ్రామస్థాయిలో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వెక్టర్ జనిత వ్యాధుల నివారణకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి మండలాన్ని వ్యాధి రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ, ఎంపీఓ శ్రీ ప్రదీప్, సబ్ యూనిట్ అధికారి విలాయత్ బేగ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళ భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ చిట్టి సునీత

**ముస్తాబాద్ జూన్ 18 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం గూడూర్ గ్రామ సర్పంచ్ చిట్టి సునీత వెంకట్ నర్సింగరావు ఆధ్వర్యంలో గ్రామంలో నూతన వివో బిల్లింగ్ కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు బిల్లింగ్ ఎంతో అవసరం ప్రతినెల మీటింగు ఏర్పాటు చేసుకోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉండేది ఇప్పుడు ప్రభుత్వం ద్వారా బిల్లింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ బిల్డింగును అతి త్వరలోనే పూర్తి చేసి మహిళలకు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లచ్చులు, ఉప సర్పంచ్ తాటకర్ల ప్రభాకర్, పాలకవర్గం, ఏపీవో ఆనంద్ కుమార్, పి ఆర్ ఏ ఈ, సీసీ బి పద్మ, వివో ఏ బి పద్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాకలి బాబు, మహిళ గ్రామ శాఖ అధ్యక్షులు రజిని, దిలీప్, గ్రామంలో ఉన్నటువంటి మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకులు కంచర్ల రవి గౌడ్ ముందస్తు అరెస్ట్



**సిరిసిల్ల టౌన్ జూన్ 19 (జనం సాక్షి)**
సీఎం ఇల్లు ముట్టడి కార్యక్రమ నేపథ్యంలో విద్యా సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులను, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న వారిపై అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, ఎన్ని నిర్బంధాలు విధించినా బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.విద్యార్థి సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# లేఅవుట్ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి పంతం రవి



**సిరిసిల్ల టౌన్ జూన్ 19 (జనం సాక్షి)**
సిరిసిల్ల మున్సిపల్ 13వ వార్డు పరిధిలోని శాంతినగర్ లో గల సర్వేనెంబర్ 1528, 1541, 1542 లోగల మున్సిపల్ లే అవుట్ స్థలాన్ని, రోడ్డును ఆక్రమించిన భూకబ్జాదారులపై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. మున్సిపల్ స్థలాన్ని వెంటనే తిరిగి స్వాధీనం చేసుకొని భవిష్యత్తు అవసరాల కొరకు వినియోగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందించారు, ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో అనేక లేఔట్ స్థలాలు అన్యాక్రాంతం గా భూ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయని అయినా మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమని ఈ క్రమంలోనే శాంతినగర్ శివారులోని మున్సిపల్ లేఔట్ స్థలమైన 308 గజాల స్థలాన్ని, రోడ్డును కబ్జా చేసి సుమారు కోటిన్నరకు సంబంధించిన స్థలాన్ని ప్లాట్లుగా చేసి కొందరు భూ కబ్జాదారులు విక్రయించడం జరిగిందని, ఆ స్థలం వద్ద మున్సిపల్ అధికారులు పెట్టిన బోర్డును కూడా తొలగించి వేయడం చూస్తుంటే భూకబ్జాదారులకు స్థానిక రాజకీయ నాయకుల అండ కూడా ఉన్నట్టు స్పష్టమవుతుందని ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు అట్టి స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని అక్కడ మున్సిపల్ కు సంబంధించిన కంచెవేయాలని ఆ క్రమంలోనే భవిష్యత్తు అవసరాల కొరకు అట్టి స్థలాన్ని ఉపయోగించాలని పంతం రవి డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ను కలిసిన వారిలో సిపిఐ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కమిటీ సభ్యులు సోమనాగరాజు తదితరులు ఉన్నారు,

# కుర్నాపల్లి ఉమామహేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ గా కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి



**ఎడపల్లి, జూన్ 18 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలోని శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా గ్రామానికి చెందిన కొప్పుల చంద్రశేఖర్ రెడ్డిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు చైర్మన్ గా కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులుగా కాట్నపల్లి రమేష్ గౌడ్, కొండ మొగులయ్య, నేరేడు అంజయ్య, స్వరూపలను నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించి, తమ అమూల్యమైన ఆశీస్సులు అందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు మరియు బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షులు పులిశ్రీనివాస రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్ ల అమూల్యమైన సహకారం, ప్రోత్సాహానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ ఉమామహేశ్వర ఆలయం అభివృద్ధితోపాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన పూర్తి సహకారాన్ని అందిస్తారని కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

**బోధన్ శివాలయం చైర్మన్ గా లక్ష్మణ్ పటేల్**
అలాగే బోధన్ ఏక చక్ర శివాలయం చైర్మన్ గా లక్ష్మణ్ పటేల్ ను నియమిస్తూ ఎండోమెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

# సిరిసిల్ల ,సిద్దిపేట డిపో మేనేజర్లకు వినతి పత్రం అందించిన సర్పంచ్ చిగురు నరేష్



ముస్తాబాద్ జూన్ 18 (జనం సాక్షి)
ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామానికి సిరిసిల్లకు వెళ్లే శ్రామికులకు. వివిధ గ్రామాల నుండి వస్తున్నటువంటి పాఠశాల విద్యార్థులకు సిద్దిపేట ఇంటర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సిరిసిల్ల డిపో మేనేజర్ , సిద్దిపేట్ డిపో ఇంచార్జ్ మేనేజర్లకు వినతి పత్రం అందించారు. బదనకల్ గ్రామ సర్పంచి చిగురు నరేష్ మా గ్రామానికి ప్రతిరోజు బస్సు సౌకర్యం అందించి సహకరించాలని కోరుతూ బదనకల్ గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ వార్డ్ మెంబర్ తుపాకుల యాదగిరి గౌడ్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిగురు ప్రవళిక గారు డిపో మేనేజర్ లకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది .సానుకూలంగా స్పందించి త్వరలోనే మీ గ్రామానికి బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపిన డిపో మేనేజర్ గారికి ఇన్చార్జి మేడం గారికి ధన్యవాదాలు తెలిపిన గ్రామ సర్పంచ్ చిగురు నరేష్. సిద్దిపేట డిపో. సిరిసిల్ల డిపో నుండి గ్రామానికి బస్సు వస్తుంది గ్రామ ప్రజలకు కూడా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము అన్నారు

# కేజీబీవీ పాఠశాల సందర్శించిన జి సి ఈ ఓ. నీరజ



**కథలాపూర్ జూన్ 18 ( జనం సాక్షి)**
కథలాపూర్ మండలంలోని గురువారం రోజున కేజీబీవీ కథలాపూర్ పాఠశాలను జీసీఈఓ మేడం నీరజ,ఏ ఎమ్ ఓ చంద్రశేఖర్ మరియు ఎమ్ ఈ ఓ శ్రీనివాస్ కేజీబీవీ పాఠశాలను సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, నోట్ బుక్స్ ను, దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి లావణ్య మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.